పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించాలి

జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

అన్నపురెడ్డిపల్లి, మార్చి 27: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని అబ్బుగూడెం, మర్రిగూడెం పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. అధికారులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ... పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పించాలని, ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఆర్ఐ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి: డీపీవో

నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో సుధీర్‌బాబు

పాల్వంచ రూరల్, మార్చి 27: పంచాయతీల్లోని ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) సుధీర్ బాబు ప్రజలను కోరారు. మండలంలోని తోగ్గూడెం పంచాయతీని బుధవారం ఆయన సందర్శించారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పంచాయతీలో పారిశుధ్య పనులు ఏవిధంగా జరుగుతున్నాయి? తడి, పొడి చెత్త నిర్వహణ ఎలా ఉంది? అనే అంశాలను గమనించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఏంపీవో నారాయణ, పంచాయతీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ముగ్గురిపై కేసు

పాల్వంచ రూరల్; మార్చి 27: బాలింత అనే జాలి కూడా చూపకుండా వేధింపులకు గురిచేస్తూ అదనపు కట్నం కోసం ఒత్తిడి చేస్తున్న ముగ్గురిపై పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం సుభాశ్‌నగర్‌లో ఉంటున్న శివకృష్ణతో పాల్వంచ మండలం కేశవాపురానికి చెందిన రమ్యతో 2017లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. వారం క్రితం రమ్య మరో కుమార్తెకు జన్మనిచ్చింది. దీంతో రమ్యను సూచిపోటి మాటలతో భర్త, అత్తమామలు వేధిస్తున్నారు. ఇదే క్రమంలో అదనపు కట్నం కూడా కావాలని ఒత్తిడి తేవడం ప్రారంభించారు. వారి బాధలు భరించలేకపోయిన రమ్య.. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త శివకృష్ణ, అత్తమామలు లక్ష్మి, అప్పారావుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

గుండాల, మార్చి 27: టెట్ పరీక్ష ఫీజు అధికంగా పెంచడం వల్ల నిరుద్యోగులపై అధికభారం పడుతుందని, వెంటనే తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే షాహిద్ అన్నారు. బుధవారం గుండాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక పేపర్ రాస్తే రూ.1000, రెండు పేపర్లు రాస్తే రూ.2000 ఫీజు పెంచడం సరికాదని అన్నారు.

రూ.1.20 లక్షల పట్టివేత

అశ్వారావుపేట, మార్చి 27: అనుమతి లేకుండా పరిమితికి మించి తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన నాగబాబు బుధవారం కారులో వెళ్తుండగా స్థానిక రింగ్ రోడ్డు సెంటర్లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీ చేసి రూ.1.20 లక్షల నగదు గుర్తించారు. నగదుకు సరైన పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు అదనపు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్యయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు నాకు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **యర్రంశెట్టి వెంకటదుర్గ**, W/o: **నాగరాజు**, **వయస్సు** : 23 సం||లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : ఇ.నెం. 2-195, చిన్నంశెట్టి వారి బజార్, అశ్వారావుపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిస్ట్రారు ఖమ్మం, సబ్ రిజిస్ట్రారు వారి యిలాఖా కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, అశ్వారావుపేట గ్రామ పంచాయితీ, గ్రామ కంఠం దాఖలా చిన్నంశెట్టి వారి బజార్ గ్రామం యందు నేను నీకు దఖలు పరిచిన ఇ.నెం. 2-99 (Ass.No. 244) దాఖల RCC బిల్డింగ్ అందుకు అనుభందమైన ఖాళీ స్థలంతో సహా గల దాని మొత్తం వైశాల్యం 301.57 చ||గ||లు ఇందులో నిర్మాణమైన RCC బిల్డింగ్ కట్టుబడి వైశాల్యం 793.6 చ||అ||, **డాక్యుమెంట్ నెం.** : **660/2024** గల సదరు ఆస్తికి హద్దులు : **తూర్పు** : మిగిలిన నా స్వంత స్థలం మరియు నాచే వదలబడిన దారి **పడమర** : చిన్నంశెట్టి సత్యనారాయణ గారి ఇల్లు, **ఉత్తరం** : సి.సి.రోడ్డు, **దక్షిణం** : గుంటు హనుమంతరావు గారి ఖాళీ స్థలం.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

SALE / RENT

★కొత్తగూడెం, విద్యానగర్ కాలనీలో 2.5 Floor, బిల్డింగ్ లీజు / అమ్మకమునకు కలదు. వివరాలకు సంప్రదించండి : సెల్ : 7013934012 KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

సొసైటీ నిర్లక్ష్యం.. రైతులకు శాపం

బాధితులకు అందని బీమా పరిహారం
కార్యాలయం చుట్టూ రోజూ ప్రదక్షిణ
ఉద్యోగుల తీరుపై తీవ్ర ఆగ్రహం

అశ్వారావుపేట సహకార సంఘ కార్యాలయం

అశ్వారావుపేట, మార్చి 27: అశ్వారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. రైతు మృతిచెందినా.. సకాలంలో బీమా పరిహారం అందించడంలో ఉద్యోగులు కాలయాపన చేస్తున్నారు. బాధిత కుటుంబాలు పరిహారం కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఉద్యోగుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసహనం కోల్పోయిన బాధత కుటుంబాలు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే... అశ్వారావుపేట సహకార సంఘం ఉద్యోగులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గడిచిన నాలుగేళ్ళుగా సుమారు 25 మంది రైతులు మృతిచెందినా.. బీమా కంపెనీలకు సంఘం బాధ్యులు ధ్రువీకరణ పత్రాలు అందజేయలేదనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బీమా పత్రాలు అందిస్తే ఏళ్ళు గడిచినా కంపెనీలు ఎందుకు పరిహారం మంజూరు చేయడం లేదన్న ప్రశ్నలు వారిని వెంటాడుతున్నాయి. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. కనీసం సమాచారం చెప్పేందుకు ఉద్యోగులు కూడా అందుబాటులో ఉండడం లేదని మండి పడుతున్నారు. ఇప్పటికైనా పాలక వర్గం స్పందించి బాధిత కుటుంబాలకు బీమా పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై సంఘం చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణను వివరణ కోరగా బీమా కంపెనీల మార్పు, బీమా దరఖాస్తుల్లో కొన్ని పొరపాట్ల వల్ల పరిహారం మంజూరులో కొంత ఆలస్యమైందని సమాధానం ఇచ్చారు.

మూడేళ్లుగా తిరుగుతున్నా..

మా తండ్రి గుజ్జుల వీరాస్వామి 2020లో అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మరణించిన 2 నెలల్లోనే సొసైటీకి బీమా పరిహారం కోసం దరఖాస్తు చేశా. అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు అందించాను. మూడేళ్ళుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిహారం అందలేదు. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలనుకుంటున్నాను. **– గుజ్జుల చంద్రశేఖర్, రైతు కుమారుడు, భీమునిగూడెం**

ప్రతిఒక్కరికీ ఉపాధి కల్పించాలి

అడిషనల్ డీఆర్‌డీవో రవికుమార్

మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీవో నల్లభోతుల రవికుమార్

అశ్వారావుపేట, మార్చి 27: దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ ఉపాధి పని కల్పించాల్సిన బాధ్యత ఉపాధిహామీ సిబ్బందిదేనని, అందుకు తగిన ప్రణాళికతో వేసవిలో పనులు చేపట్టాలని అడిషనల్ డీఆర్‌డీవో నల్లభోతుల రవికుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి మేట్‌లకు ఒక్కరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ కూలీలకు రోజువారీ కూలీ రూ.272లు పడేలా పనిచేయించాల్సిన బాధ్యత మేట్‌లదే అన్నారు. పని ప్రదేశాల్లో షేడ్ నెట్‌లు, తాగునీరు, ఫస్టయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి శ్రీనివాసరావు, ఎంపీవో సీతారామరాజు, అశ్వారావుపేట, దమ్మపేట ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మేట్‌లు పాల్గొన్నారు.

టేకులపల్లి, మార్చి 27: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బంది టీఏ, ఎఫ్ఏ, మేస్త్రీలకు, పంచాయతీల కార్యదర్శులకు బుధవారం ఎంపీడీవో జి.రవీంద్రరావు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు దినసరి వేతనంలో రోజుకు రూ.272 పొందేలా ఎంత పని చేయాలి, పనిప్రదేశం వద్ద కనీస సదుపాయాల ఏర్పాటు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఎంపీవో గణేష్ గాంధీ, ఏపీవో శ్రీనివాస్, టీవోటీలు వీరన్న, శంకర్, తిరుపతయ్య, కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు అభినందన

మణుగూరుటౌన్, మార్చి27 : హోలీ పండుగ రోజు ఈతకు వెళ్లి గోదావరి నదిలో మునిగిపోతున్న ముగ్గురు యువకుల ప్రాణాలను కాపాడిన మణుగూరు కానిస్టేబుల్ వినయ్, సనైను డీఎస్పీ రవీందర్‌రెడ్డి అభినందించారు. బుధవారం మణుగూరు డీఎస్పీ కార్యాలయంలో వారికి క్యాష్ రివార్డు అందజేశారు. మణుగూరు సీఐ సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

సారపాక, మార్చి 27 : సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు సంఘం(14వ వేతన) ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర లేబర్ కమిషనర్ సునీత, వరంగల్‌లో జాయింట్ కమిషనర్ రమేశ్‌బాబుకు బీఆర్‌టీయూ, సీఐటీయూ, ఐఈయూ యూనియన్ల ఆధ్వర్యంలో బుధవారం చాలెంజ్ లెటర్లు అందజేశారు. బీఆర్‌టీయూ, సీఐటీయూ, ఐఈయూ నాయకులు పాల్గొన్నారు.

సూర్యం సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే పాయం

సారపాక, మార్చి 27 : మోరంపల్లిబంజర ఉమ్మడి పంచాయతీలో సర్పంచ్‌గా పని చేసిన తేజావత్ సూర్యం సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆ గ్రామానికి వెళ్లి సూర్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, సేవాలాల్, ఆనందరావు, సుగుణ, పున్నా, భాస్కరరావు, లింగ్యా తదితరులు పాల్గొన్నారు.

కొలతల ద్వారా అధిక వేతనం పొందొచ్చు: ఎంపీడీవో

మాట్లాడుతున్న ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచ రూరల్, మార్చి 27: ఉపాధి హామీ కూలీలు కొలతల ద్వారా పనులు చేస్తే అధిక వేతనం పొందవచ్చునని ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉపాధి హామీ సిబ్బంది, మేట్లకు జగన్నాథపురం రైతు వేదికలో బుధవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చేయాల్సిన పనుల గురించి ముందుగానే కొలతలు నిర్దేశించుకుంటే రోజుకు రూ.272 వేతనం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. అదేవిధంగా మేట్లు హాజరు వేయడంలో దిద్దుబాట్లు ఉండకూడదని అన్నారు. అలాగే, మిషన్ భగీరథ నీటిని అందరూ తాగాలని, ఆ నీటి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలావతి వివరించారు. ఏపీవో రంగా, పుల్లయ్య, సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.

13 రోజులు ముందుగానే లక్ష్యసాధన

బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కొత్తగూడెం ఏరియా రికార్డులు
ఇదే ఒరవడితో ముందుకు సాగుదాం: జీఎం శాలెంరాజు

రామవరం, మార్చి 27: సింగరేణి కొత్తగూడెం ఏరియా బొగ్గు ఉత్పత్తిలో రికార్డుల పరంపర కొనసాగిస్తూనే ఉంది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో నెలకొల్పిన 134.56 లక్షల టన్నుల అత్యధిక ఉత్పత్తి రికార్డులను ఈ ఏడాది మార్చి 25 నాటికి 135.16 లక్షల టన్నులతో అధిగమించి సరికొత్త రికార్డును నమోదు చేసుకుంది. ఈ అత్యున్నత రికార్డు ఇటు కొత్తగూడెం చరిత్రలోనే కాకుండా సింగరేణి కంపెనీ చరిత్రలోనూ నిలిచిపోయింది. అత్యధిక ఉత్పత్తి చేసిన ఏరియాగా చరిత్ర సృష్టించింది. అలాగే, అటు ఉత్పత్తిలోనే కాకుండా బొగ్గు రవాణాలో కూడా ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ ఏడాది మార్చి 25 నాటికే 150.06 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇందులో భాగంగా జేవీఆర్ సీహెచ్‌పీకి ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన వంద లక్షల టన్నుల బొగ్గు రవాణాకు గాను సోమవారం నాటికి 100.28 లక్షల టన్నులు సాధించింది. అలాగే, 2,494 రేకుల బొగ్గును రవాణా చేసి దాని గత సామర్థ్యాన్ని అధిగమించింది.

ఇదే ఒరవడితో ముందుకు సాగుదాం : ఏరియా జీఎం

సంస్థ వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో కొత్తగూడెం ఏరియా ఆల్ టైం రికార్డులు నెలకొల్పుతోంది. 2023–24 ఉత్పాదక సంవత్సరానికి గాను కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడంలో సంస్థ సీఎండీ బలరాం దిశా నిర్దేశాలతో డైరెక్టర్ (పా) వెంకటేశ్వర్‌రెడ్డి సలహాలు సూచనలతో లక్ష్యాలను సాధించింది. ఈ లక్ష్యసాధనలో భాగస్వామ్యమైన ఉద్యోగులకు, అధికారులకు, యూనియన్ ప్రతినిధులందరికీ ప్రత్యేక అభినందనలు తెలుపుకుంటున్నాం. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికే అధిక ప్రాధాన్యమిస్తున్నాం. అధికారులు, సిబ్బంది అందరమూ సమన్వయంతో పనిచేస్తూ ప్రమాద రహిత ఏరియాగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి చేద్దాం. ఇదే స్ఫూర్తితో రానున్న ఆర్థిక సంవత్సరంలో కూడా నిర్దేశించిన లక్ష్యం 157.50 లక్షల టన్నులను కూడా అధిగమిద్దాం. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించి కంపెనీ పురోగాభివృద్ధికి కృషిచేద్దాం.

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

స్థానిక దుకాణదారులపై దాడి.. దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

వాహనాలను అడ్డుకుంటున్న యువకులు

చండ్రుగొండ, మార్చి 27: మద్యంమత్తులో యువకులు హల్‌చల్ చేసి, పలువురు దుకాణదారులపై, పోలీస్ సిబ్బందిపై దాడి చేసిన ఘటన బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.... జూలూరుపాడు మండలానికి చెందిన ఐదుగురు యువకులు అయ్యన్నపాలెంలోని ఓ ఫంక్షన్‌కు హాజరై తిరుగు ప్రయాణంలో చండ్రుగొండ ప్రధాన సెంటర్‌లోని టిఫిన్ సెంటర్‌లో పానీపూరి తిని డబ్బులు చెల్లించకపోవడంతో దుకాణదారుడు డబ్బులు ఇవ్వాలని అడగ్గా ఐదుగురు యువకులు అతినిపై దాడి చేశారు. అడ్డుకోబోయిన స్థానికులపై, ఇతర దుకాణదారులపై దాడులు చేశారు. దీంతో స్థానికులు మందుబాబులకు దేహశుద్ధి చేశారు. విషయం పోలీసులకు తెలియడంతో మద్యంమత్తులో ఉన్న యువకులను అదుపులోకి తీసుకునే క్రమంలో ఇద్దరు కానిస్టేబుళ్లపై సైతం దాడి చేసినట్లు సమాచారం. పోలీసు సిబ్బంది యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మద్యం మత్తులో వీరంగంచేసిన యువకులపై చట్టపరంగా కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఇష్టానుసారంగా ఇసుక లారీల నిలిపివేత

ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం

మణుగూరు–ఏటూరునాగారం ప్రధాన రహదారిపై నిలిపివేసిన ఇసుక లారీలు

మణుగూరుటౌన్, మార్చి 27: మణుగూరు–ఏటూరునాగారం ప్రధాన రహదారిపై సుమారు గంటకుపైగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇసుక లారీలను ఇష్టానుసారంగా రోడ్డుకు ఇరువైపులా నిలుపుదల చేసి, అడ్డంగా తిప్పుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం మణుగూరు మండలంలోని సాంబాయిగూడెం వద్ద ఇసుక ర్యాంపు నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా వందల సంఖ్యలో ఇసుక లారీలు మణుగూరు–ఏటూరునాగారం ప్రధాన రహదారిపై నిలిచిపోవడంతో ఎర్రటి ఎండలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా గ్రంథాలయానికి కూలర్ వితరణ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 27: ఆర్యవైశ్య మహాసభ కొత్తగూడెం పట్టణం అధ్యక్షుడు దారా నగేశ్, ప్రధాన కార్యదర్శి జూలూరి ఆనంద్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయానికి ఆర్యవైశ్య గుప్త దాత ఎయిర్ కూలర్‌ను వితరణగా అందించారు. కొత్తగూడెంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మహాసభ బాధ్యులు నరేంద్రుల రుషి కుమార్, మేడ గణేశ్, కొయ్యడ నగేశ్, కొదుమూరి సురేశ్, గ్రంథపాలకులు వరలక్ష్మీ దేవి, మణిమృదుల పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మోటర్ వితరణ

పాల్వంచ, మార్చి 27: మున్సిపాలిటీ పరిధిలోని వికలాంగుల కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో వేసవి దృష్ట్యా లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ ఆధ్వర్యంలో రూ.16 వేల విలువైన 1హెచ్‌పీ మోటర్‌ను వితరణగా అందించారు. క్లబ్ కో ఆర్డినేటర్ ఆరుద్ర సత్యనారాయణ మోటర్ స్విచ్ ఆన్ చేసి మాట్లాడారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం అందించే సేవా కార్యక్రమాల్లో తమ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. లయన్స్ క్లబ్ బాధ్యులు పుట్టా నాగేశ్వరరావు, కాటా నవీన్, పోట్రు సతీశ్, చేపూరి బ్రహ్మచారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

టేకులపల్లి, మార్చి 27: అక్రమంగా ఓ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సైదా రవూఫ్ బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని వాటర్ ట్యాంక్ రోడ్డులోని ఏ.నాగభూషణం ఓ ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 4.40 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు పీసా గ్రామసభ

అశ్వారావుపేట రూరల్, మార్చి 27: మండలంలోని ఆసుపాక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం పీసా గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మోతీలాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక అధికారి, ఎంపీవో సీతారామరాజు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జడ్పీటీసీ వరలక్ష్మి, పీసా కార్యదర్శి, గ్రామస్థాయి అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

దగ్ధమైన ఇంటి వద్ద నీలం–సావిత్రి దంపతులు

పర్ణశాల, మార్చి 27: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబం తెలిపిన వివరాలు.. సీతానగరం గ్రామం జయంతి కాలనీలోని రేకుల ఇంట్లో వృద్ధ దంపతు లు కొప్పుల నీలం, సావిత్రి ఉంటున్నారు. నడవలేకపోతున్న నీలం.. బుధవారం ఇంటి వద్దనే ఉన్నాడు. పర్ణశాల రామాలయం వద్ద కుంకుమ అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్న సావిత్రి.. రోజులాగానే బుధవారం అక్కడకు వెళ్లింది. సాయంత్రం సుమారు నాలుగ్గంటల సమయంలో నీలం ఇంటి పైకప్పు నుంచి దట్టంగా పొగలు వస్తుండడాన్ని ఓ మహిళ గమనించి కేకలు వేస్తూ ఇంట్లోకి వెళ్లింది. నిద్రపోతున్న నీలంను తట్టి లేపి బయటకు తీసుకొచ్చింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే మంటలు వచ్చాయని గమనించిన స్థానికులు.. విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అప్పటికే ఇల్లు పూర్తి కాలిపోయింది.

దుమ్ము నివారణ చర్యలు తీసుకోవాలి

మణుగూరుటౌన్, మార్చి 27: సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా పీకేఓసీ–2, ఓసీ–4 సెక్షన్లలో ఉన్న క్రషర్ల వల్ల వచ్చే దుమ్ము నివారణకు చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ మణుగూరు ఏరియా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు అన్నారు. బుధవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దుమ్ము వల్ల కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, మార్చి 27: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో రామయ్యకు అర్చకులు బుధవారం నిత్య కల్యాణం నిర్వహించారు. బేడా మండపంలో నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

గిరిజన గురుకులం తనిఖీ

మాట్లాడుతున్న ఆర్సీవో వెంకటేశ్వరరాజు

భద్రాచలం, మార్చి 27: భద్రాచలంలోని గిరిజన గురుకుల విద్యాలయాన్ని/కళాశాలను గిరిజన గురుకులాల ఆర్సీవో తుమికి వెంకటేశ్వర రాజు బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కళాశాలలో ఎంసెట్, జేఈఈ తరగతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్ మెండెం దేవదాస్ పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ఏర్పాట్లపై నేడు సమీక్ష

భద్రాచలం, మార్చి 27: ఏప్రిల్ 17న శ్రీరామ నవమి, 18న శ్రీరామ పట్టాభిషేకం ఏర్పాట్లపై గురువారం ఉదయం భద్రాచలం సబ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి సమీక్షాసమావేశం ఉంటుందని ఆర్డీవో దామోదరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు నియమితులైన ప్రత్యేకాధికారులు సమగ్ర సమాచారంతో తప్పనిసరిగా రావాలని పేర్కొన్నారు.

నిరుపేదల 'ఉపాధి'కి జేడీ ఫౌండేషన్ 'భరోసా'

భద్రాచలం, మార్చి 27: జేడీ ఫౌండేషన్ అందించిన ఆర్థిక సాయంతో భద్రాచలానికి చెందిన నిరుపేద దంపతులైన చిన్నం శైలజ మహేష్.. తోపుడు బండి హోటల్ ఏర్పాటు చేసుకున్నారు. దీనిని బుధవారం చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ కంభంపాటి సురేష్, దంపతులు ప్రారంభించారు. నిరుపేదల స్వయం ఉపాధి కోసం 'ఉపాధి భరోసా' పేరుతో తమ ఫౌండేషన్ ఇలా ఆర్థిక సాయం అందిస్తున్నదని కన్వీనర్ మురళీమోహన్, కోఆర్డినేటర్ హన్సీ పవన్‌కుమార్ చెప్పారు. ఫౌండేషన్ సభ్యులు వినీల దేవి, కడాలి నాగరాజు, కొంజర్ల నగేష్, సాయి పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం

స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

అశ్వారావుపేట టౌన్, మార్చి 27: పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీలో నిర్మించిన ఆలయంలో బుధవారం నిర్వహించిన సంకట హర విఘ్నేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పూజలు చేశారు. ఎమ్మెల్యేతోపాటు ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సీనియర్ నాయకులు మందపాటి రాజమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, దగ్గుమిల్లి నరేంద్రకుమార్, గాడిచర్ల శ్రీను, కలకోటి రామ్మూర్తి, నారాయణ పాల్గొన్నారు.

బుర్ర సుమతి మృతికి నివాళి

నివాళి అర్పిస్తున్న హరిప్రియానాయక్

టేకులపల్లి, మార్చి 27: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన బుర్ర సుమతి అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సుమతి మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, నాయకులు నల్లమాస్ నరేందర్, శ్రీశైలం, వాసు, జానయ్య, శ్రీనివాస్ తదితరులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

వడ్డేపల్లి కాంతయ్యకు నివాళి

అన్నపురెడ్డిపల్లి, మార్చి 27: అన్నపురెడ్డిపల్లికి చెందిన వడ్డేపల్లి కాంతయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు పాల్గొని మృతుడు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట నాయకులు మామిళ్లపల్లి లక్ష్మణరావు, పుల్లారావు, చల్లా రాంబాబు, ఇనపనూరి రాంబాబు, రాఘవులు, సత్యం, నాగరాజు, బాబు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

అన్నపురెడ్డిపల్లి, మార్చి 27: ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని సీపీఐ(యం) పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జానకీపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి మోసపోతున్నారన్నారు. కార్యక్రమంలో జంగిలి వెంకటరత్నం, కోటయ్య, వెంకటేశ్వర్లు, నాగేంద్రమ్మ, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

దమ్మపేట, మార్చి 27: తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ దమ్మపేట మండల ప్రధాన కార్యదర్శి రమేశ్ తండ్రి మృతిచెందడంతో బుధవారం నాయకులు రమేశ్‌ను పరామర్శించారు. మృతికి కారణాలను తెలుసుకుని ధైర్యంగా ఉండాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు అన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బూర్గంపహాడ్, మార్చి 27 : మండల పరిధిలోని అంజనాపురం మాజీ సర్పంచ్ తేజావత్ సూర్యం అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. బుధవారం పలువురు గ్రామానికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారిలో జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత రామకొండారెడ్డి దంపతులు, డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, జూలూరుపాడు జడ్పీటీసీ భూక్యా కళావతి, బీఆర్ఎస్ నాయకులు బానోతు శ్యామ్, చేతుల పెద్దవీర్రాజు, వెంకటరత్నం, రాము తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

కరకగూడెం, మార్చి 27: ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ మధు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో విలేకరులతో మాట్లాడారు. తప్పనిసరి పరిస్థితిలో తప్ప ఎండలో బయటకు రావద్దని, ఉదయం 10గంటలలోపు, సాయంత్రం 5గంటల తరువాత వెళ్లడం శ్రేయస్కరమని తెలిపారు. వృద్ధులు, చిన్నారుల పట్ల మరింత జాగ్రత్త అవసరమన్నారు. కొబ్బరిబొండాలు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలి

మణుగూరుటౌన్, మార్చి 27: పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సత్రపల్లి సాంబశివరావు కోరారు. బుధవారం సీఐటీయూ మణుగూరు కమిటీ ఆధ్వర్యంలో వివిధ రకాల పనులు నిర్వహిస్తున్న కార్మికులను సర్వే చేసి వారి సమస్యలను తెలుసుకున్నారు. హేమంతరావు, ప్రసాద్, వినోద్, సాయికుమార్, వివిధ షాపుల్లో పనిచేసే కార్మికులు పాల్గొన్నారు.